మండుతున్న ఎండలు!

- జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఒక్కరోజే వడదెబ్బతో ఇద్దరు మృతి
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు


ఎండ నుంచి రక్షణకు రుమాలుతో ..


నిర్మానుష్యంగా కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారి

కౌటాల: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అగ్నిగుండంగా మండుతోంది. జిల్లా వాసులను వేసవి భగభగలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల కారణంగా వడదెబ్బ తగిలి మృతి చెందుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మరి కొద్ది రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని 12 మండలాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతూ ఆరెంజ్ అలర్ట్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు..

జిల్లాలో మంగళవారం ఎండలు మండిపోయాయి. గత మూడు రోజులుగా వడగాల్పుల తీవ్రత అధికమైంది. ఎండ కారణంగా ఈ నెల 27న ఒక్కరోజే వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. వారం రోజులుగా క్రమంగా ఆందోళన కలిగించే స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అత్యవసరమైతే తప్ప ఎండలో వెళ్లకూడదని, వేడి తీవ్రత తగ్గిన తరువాత వెళ్తే మేలని వైద్యులు అంటున్నారు. జిల్లాలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రెడ్ అలర్ట్ జారీ అయింది. గత సోమవారం జిల్లాలోని జంబుగాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రెడ్ జోన్‌లో ఉండేది. జిల్లాలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం కలవరపరుస్తోంది. అలాగే మిగతా మండలాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నాయి. ఆయా మండలాల్లో 40 నుంచి 45 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అల్లాడుతున్న జనం

ఎండలు మండుతుండడంతో ఉపాధిహామీ కూలీలు, ద్విచక్ర వాహనదారులు, చిరుద్యోగులు, యాచకులు దాహంతో అల్లాడిపోతున్నారు. పలువురు వడదెబ్బకు గురయ్యారు. ఉపశమనం కోసం కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు, ఇతర శీతల పానీయాలు తీసుకుంటున్నారు. పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉపశమనం కోసం ఇంట్లోని కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు రోజంతా ఆన్‌లో ఉంచుతున్నారు. ఎండలో తప్పనిసరిగా బయటకు వెళ్లే వారు తలకు రుమాలు ధరిస్తున్నారు.

వడదెబ్బతో పలువురి మృత్యువాత..

- గత మార్చి 31న కాగజ్‌నగర్ పట్టణంలో వడదెబ్బతో కాగజ్‌నగర్ మండలం కోయవాగు గ్రామానికి చెందిన లెంక సురేశ్(40) అనే హమాలీ కార్మికుడు మృతి చెందాడు.
- కౌటాల మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన గంథం శ్యాంరావు(40) వడదెబ్బతో ఏప్రిల్ 5వ తేదీన మృతి చెందాడు.
- కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీ పరిధిలోని జనగాం గ్రామానికి చెందిన వేలాది మధుకర్(24) అనే యువకుడు వడదెబ్బ తగిలి గత ఏప్రిల్ 17న మృతి చెందాడు.
- బెజ్జూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన చౌదరి రవి(24) అనే యువకుడు ఉపాధిహామీ పనులకు వెళ్లి ఏప్రిల్ 29న మృతి చెందాడు.
- ఏప్రిల్ 29న కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు (80) వడదెబ్బ తగిలి మృతిచెందాడు.
- బెజ్జూర్ మండలం గబ్బాయి గ్రామానికి చెందిన పోర్తటి శ్రీనివాస్(40) మే 2వ తేదీన వడదెబ్బతో మృతి చెందాడు.

మంగళవారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో..)

ప్రాంతం	గరిష్టం
జంబుగా	44.3
కౌటాల	43.3
కాగజ్‌నగర్	42.7
సిర్పూర్(టి)	42.5
వంకులం	42.1
లోనవెల్లి	42.0
రవీంద్రనగర్	41.9
వాంకిడి	41.9
ఆసిఫాబాద్	41.6

- ఈ నెల 4వ తేదీన రెబ్బెన మండల కేంద్రానికి చెందిన అజీజబేగం(48) వడదెబ్బ తగిలి మృతి చెందింది.
- ఈ నెల 27న ఎండదెబ్బ తగిలి మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన గేడం కుర్కుడె శ్రీ గణేశ్(75) వృద్ధ యాచకుడు వాంకిడి మండల కేంద్రంలో మృతి చెందాడు.
- దహెగాం మండలంలోని గిరవెల్లి గ్రామానికి చెందిన నిట్టురి ముత్తయ్య (60) అనే రైతు వడదెబ్బతో ఈ నెల 27న మృతి చెందాడు.

అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవసరం ఉంటే తప్పా ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదు. ప్రతిరోజూ 5 లీటర్ల నీరు తాగడం మంచిది. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరికైనా వడదెబ్బ తగిలితే త్వరగా చల్లని గాలి తగిలే ప్రదేశానికి చేర్చి, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు ద్రావణం, ఓఆర్ఎస్ తాగించాలి.

– సుధాకర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

శివాలయంలో సంకీర్తన పారాయణం


ప్రవచనాలు చెబుతున్న బాలాజీ మహరాజ్

కెరమెరి: తల్లిదండ్రులే దేవుళ్లని, వారిని పూజించడం, గౌరవించడం నేర్చుకోవాలని హరిభక్త పారాయణ బాలాజీ మహరాజ్ కేంద్రె అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహించిన సంకీర్తన పారాయణంలో భక్తులకు ప్రవచనలు ఉపదేశించారు. నేటి యువత పాశ్చాత్య పోకడలకు పోకుండా వారిని నివారించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. అనంతరం వైభవంగా మాతృపితృల కార్యక్రమం జరిగింది. చిన్నారులు చేసిన భజనలు ఆహుతులను ఆకర్షించాయి. శివ మందిర్ సంస్థాన్ సభ్యులు, గ్రామ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుపై అవగాహన కల్పించాలి


క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అంజద్‌పాషా

కెరమెరి: సేంద్రియ ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మంగళవారం సావర్‌ఖేడా, నిషాని, ఇందాపూర్ గ్రామపంచాయతీలను ఆయన సందర్శించారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన శ్మశానవాటికలు, పల్లెప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలను సందర్శించారు. ఆయన వెంట ఈజీఎస్ ఈసీ ఐక్యనాయక్, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి


టాయిలెట్లను పరిశీలిస్తున్న ఎంఎన్‌వో

కెరమెరి: బడిబాట కార్యక్రమం ప్రారంభమయ్యే లోపు అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలని ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని లేండిగూడ, ఎసాపూర్, పద్మావతి, ఇంద్రానగర్, జన్కాపూర్, లక్మాపూర్, దేవాపూర్, కరంజివాడ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి మేజర్ మరమ్మతులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండలంలోని నంబాల గ్రామంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సింగరేణి సీఎండీని కలిసిన బీఆర్ఎస్ నాయకుడు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న విమలేష్

రెబ్బెన: సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం నాయక్‌ను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ యువ నాయకుడు గుంపుల విమలేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఅండ్ఎండీగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

కెరమెరి: మండలంలోని నిషాని గ్రామానికి చెందిన వసాకే బాపూరావు, సునీతల కూతురు వసాకే గీత(20) అదృశ్యమైనట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఈ నెల 25న స్టడీ ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకునేందుకు ఇంటి నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లిన గీత నేటికీ తిరిగిరాలేదన్నారు. తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల ప్రజాపరిషత్ సభ్యులు, అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి ప్రవీణ్ కుమార్ పరామర్శ


పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: మండలంలోని నాగులవాయి గ్రామానికి చెందిన చెండే నీలయ్య గత రెండు నెలల క్రితం మృతి చెందగా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఆయన వెంట నాయకులు శ్యామ్ రావు, రాజేశ్, ఖాజా మియా, షణ్ముఖ మోహన్, నందయ్య వసంత్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిరుద్యోగులకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో యువకులకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత జూన్ 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9866565156 సంప్రదించాలన్నారు.

నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి


పెంచికల్‌పేట్: అవగాహన కల్పిస్తున్న ఏవో


బెజ్జూర్: అవగాహన కల్పిస్తున్న ఏఈవో రవితేజ

పెంచికల్‌పేట్: నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట్ ఏవో రాజుల నాయుడు అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కొంతమంది వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని గ్రామాల్లో లూజ్ విత్తనాలు విక్రయిస్తున్నారన్నారు. రైతులు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, ప్రతీ కొనుగోలుకు రశీదు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు సాగు చేసి రైతులు మోసపోవద్దని సూచించారు. ఆయన వెంట ఏఈవో శ్రీవిద్య ఉన్నారు.

బెజ్జూర్: ఎవరైనా లూజ్ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఏఈవో రవితేజ అన్నారు. మంగళవారం మండలంలోని ఊట్‌సారంగపల్లి, సలుగుపల్లి, అర్కగూడ గ్రామాల్లో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిరిగా రశీదు పొందాలని సూచించారు. అందులో లాట్ నంబర్, వెరైటీ పేరు, ఎక్స్‌పైరీ వంటి విషయాలు ఉన్నాయా.. లేవా అనేది తీసుకున్న ప్యాకెట్‌తో సరిపోల్చుకోవాలన్నారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కెరమెరి: వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలను తప్పకుండా పాటించాలని ఏఈవో వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని సాకడ గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒకటికి రెండుసార్లు వర్షం పడ్డాకనే విత్తనాలు నాటాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు.

చింతలమానెపల్లి: రైతులు తమ పంటల కోసం నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని ఏవో రామక్రిష్ణ అన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ విత్తనాల కొనుగోలులో పలు సూచనలు చేశారు. ఫర్టిలైజర్, విత్తన దుకాణాలలో సేకరించిన విత్తనాల నమూనాలను రాజేంద్రనగర్ ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. ఏఈఓలు శ్రీనివాస్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- తల్లిదండ్రులు మృతి
- ముగ్గురు పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- నానమ్మ, తాతయ్యలే దిక్కు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు

సాయం చేయాలనుకునేవారు..
మడావి కాశీనాథ్,
బ్యాంక్ అకౌంట్ నంబర్
79048 845947
తెలంగాణ గ్రామీణ బ్యాంక్,
ముత్తంపేట్, కౌటాల
ఫోన్‌పే: మడావి సురేశ్,
సెల్: 6300140975


నానమ్మ, తాతయ్యతో ముగ్గురు పిల్లలు

కౌటాల: తల్లిదండ్రుల ప్రేమానురాగాలతో అల్లారు ముద్దుగా పెరగాల్సిన పిల్లలకు చిన్నతనంలోనే పెద్ద కష్టం వచ్చింది. తల్లిదండ్రులు దూరంకావడంతో ముగ్గురు పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వివరాల్లోకి వెళ్తే కౌటాల మండలం పార్డీ గ్రామానికి చెందిన మడావి దివాకర్(36)కు 2010లో దహెగాం మండలానికి చెందిన భారతితో వివాహమైంది. వీరికి అజిత్‌కుమార్ (12), విజయ్‌కుమార్ (10) ఇద్దరు సంతానం. ఆనందంగా సాగుతున్న కుటుంబంలో అనారోగ్యం కారణంగా 2013లో భారతి మృతి చెందింది. దూరమైన పిల్లలకు తల్లితోడు కావాలనే ఉద్దేశంతో దివాకర్ గతేడాది మహారాష్ట్రలోని వీరూర్‌కు చెందిన శారద (30)ను వివాహం చేసుకున్నాడు. వీరికి గత మార్చి నెలలో మగ శిశువు శివకుమార్ జన్మించాడు. కానీ వీరి సంతోషం ఎంతోకాలం నిలువలేదు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన శారద మార్చి 15న చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్య మృతి చెందడంతో పిల్లల భవిష్యత్తుపై బెంగతో తండ్రి దివాకర్ కుంగిపోయాడు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ వారం కిందట అతను మృతి చెందాడు.

నానమ్మ- తాతయ్యల వద్ద..

ప్రస్తుతం అజిత్‌కుమార్, విజయ్‌కుమార్‌లతో పాటు రెండు నెలల శివకుమార్‌లను వృద్ధులైన నానమ్మ తాతయ్యలు విమలాబాయి- కాశీనాథ్‌లు చూసుకుంటున్నారు. కాగా వారు ఉండేందుకు సరైన ఇల్లు కూడా లేదు. అజిత్‌కుమార్ సిర్పూర్ (టి)లో ఆరో తరగతి చదువుతుండగా.. శివకుమార్ గ్రామంలోనే 5వ తరగతి చదువుతున్నాడు. వయోభారంతో బాధపడుతున్న వృద్ధులైన నానమ్మ -తాతయ్యల వద్ద పిల్లల సంరక్షణ బాధ్యత ప్రశ్నార్థకంగా మారింది. పిల్లల సంరక్షణ, చదువు బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

అన్ని విధాలుగా ఆదుకుంటాం

బాధిత అనాథ పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పార్డీ గ్రామంలో బాధిత పిల్లలను ఆయన పరామర్శించారు. భార్యాభర్తల మృతికి గల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు చిన్నారులు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ..

తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలైన ముగ్గురు పిల్లలను మంగళవారం జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందించారు. పిల్లలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, స్పాన్సర్షిప్ పథకం కింద అర్హులైన ఇద్దరు పిల్లలకు నెలకు రూ. 4వేలు అందిస్తామన్నారు. రెండు నెలల బాబును ప్రభుత్వానికి అప్పగిస్తే ఆదిలాబాద్‌లోని శిశుగృహానికి తరలించి న్యాయబద్ధంగా దత్తత ఇస్తామని తె లిపారు. బాలల పరిరక్షణ లీగల్ అధికారి శ్రీ నివాస్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

2న మహేశ్వరీ సమాజ్ సమావేశం


మాట్లాడుతున్న ద్వారకాజావర్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో జూన్ 2న మహేశ్వరీ సమాజ్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మహేశ్వరీ సమాజ్ పట్టణ ప్రధాన కార్యదర్శి ద్వారకా జావర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని రాజస్థాన్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత పాశ్చాత్య పోకడలకు పోకుండా, దేశ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించే విధంగా, సనాతన హిందూ ధర్మాన్ని కాపాడేందుకు, యువతను సన్మార్గంలో నడిచేలా దిశానిర్దేశం చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మహేశ్వరీ సమాజ్ పట్టణ అధ్యక్షుడు శంకర్‌లాల్, కోశాధికారి పంకజ్ అసావా, నాయకులు మహవీర్ సోని, బంకట్ అసావా, వేణులోయా, శ్యాంసుందర్, బ్రిజ్‌మోహన్, పునిత్ ముందాడా, రామ్మోహన్ సోని, శ్యాంసోని, మనోజ్‌సోమాని తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేసిన ఏవో

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ పరిధిలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం సిర్పూర్(టి) మండల వ్యవసాయ శాఖ అధికారిణి మధులత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలనే రైతులకు విక్రయించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు రైతులకు సకాలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని ఆమె సూచించారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాల్లో ఉన్న విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

జొన్న కొనుగోళ్ల గడువు పెంచాలి

నార్నూర్: జొన్న కొనుగోళ్ల గడువును పొడిగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జొన్న కొనుగోలు కేంద్రం గడువు ఈనెల 31తో ముగిస్తుందని ప్రచారం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, కలెక్టర్ స్పందించి వచ్చే నెల 15 వరకు జొన్న కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

కోరం లేక సమావేశం వాయిదా

తాండూర్: మండల సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు సూపరింటెండెంట్ వేణుగోపాల్ ప్రకటించారు. సమావేశానికి కొత్తపల్లి ఎంపీటీసీ రెబ్బెన యశోద తప్ప ఎవరూ హాజరుకాలేదు.

పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలి


కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 730 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదనపు తరగతి గదులు, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, ఫ్యాన్లు, బెంచీలు, గ్రీన్‌బోర్డులు, డిజిటల్‌బోర్డు కల్పించడంతోపాటు పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పాఠశాల పరిశుభ్రత కోసం స్వచ్ఛ కార్మికులను ప్రతీ పాఠశాలలో నియమించాలని కోరారు.

విద్యార్థుల్లో పుస్తక పఠనాభివృద్ధికి తోడ్పాటు


కథల పుస్తకం ద్వారా బోధిస్తున్న సీఆర్పీ

రెబ్బెన: వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన వేసవి శిబిరాల ద్వారా విద్యార్థుల్లో పుస్తక పఠనాభివృద్ధికి సీఆర్పీలు కృషి చేస్తున్నారని ఎంఈవో వెంకటేశ్వర స్వామి అన్నారు. మండలంలో సుమారు 20 గ్రామాల్లో వేసవి శిబిరాలు నిర్వహిస్తూ ప్రతీరోజు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని గ్రామంలోని విద్యార్థులకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యార్థులకు పఠనాకృత్యాలు నిర్వహిస్తున్నారన్నారు. సీఆర్పీ 450 మంది పిల్లలకు, 120 మంది తల్లిదండ్రులకు పుస్తక పఠనం, ఐవీఆర్ నంబర్‌కు ఫోన్ చేయటం, లిట్రసీ క్లౌడ్ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. నంబాల సీఆర్పీ రాజేశ్ జక్కులపల్లి పాఠశాలలో నిర్వహిస్తున్న శిబిరంలో పాల్గొని కప్ప తారల కోరిక అనే కథను విద్యార్థులకు కథల పుస్తకం ద్వారా బోధించారు.

బీసీ గణన చేపట్టాలి


మాట్లాడుతున్న బీసీ ఐక్యసంఘాల నాయకులు

రెబ్బెన: రాష్ట్రంలో బీసీ గణన చేపట్టాలని బీసీ ఐక్యసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన గ్రామపంచాయతీల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు రాజకీయ, సామాజిక పరంగా అన్యాయం జరుగుతోందన్నారు. సమావేశంలో నాయకులు మల్లయ్య, మల్లేష్, తోట లక్ష్మణ్, దయాకర్, కిష్టయ్య, తిరుపతి, సతీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.